# మామూలు మగాడు

-పొన్నాడ సత్యప్రకాశరావు

''హలో...బాసూ బిజీనా''

చూస్తున్న ఫైల్లోంచి తలెత్తి చూసాను. ఎదురుగా వెంకట్రావు.

''హలో...మామూలే. కమాన్...'' సీట్ ఆఫర్ చేసాను అయిష్టంగానే రాని నవ్వును అద్దెకు తెచ్చుకుని.

''అదృష్టం అంటే నీదే బాసూ. మీ ఆఫీసు ఎప్పుడూ కళకళలాడుతూ వుంటుంది. ఈస్ట్‌మన్ కలర్, స్కోప్, కొండొకచో సెవెన్టీ ఎంఎం కూడా. మా ఆఫీసూ వుంది. బ్లాక్ అండ్ వైట్. సిక్స్‌టీన్ ఎంఎం'' అన్నాడు. ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు ఆఫీసంతా కలియజూస్తూ. నేను వినడం మానేసి వింటున్నట్లుగా మొహం పెట్టి నా పని చేసుకోసాగాను. వినడానికి ఏమి వుండదు. ఎప్పుడూ ఒక్కటే సొద.

వెంకట్రావు నా నైబర్ కాబట్టి పలకరించుకోవడం తప్పదు కాబట్టి పరిచయం ఏర్పడింది. అంతేకానీ స్నేహం ఏర్పరుచుకోవాల్సిన లక్షణాలు ముచ్చుక్కైనా లేవు వాడిలో. నేను ఎక్కువగా మాట్లాడకపోయినా వాడే ఎక్కువగా మాట్లాడుతూ వుంటాడు. వాడిది అక్కౌంట్స్ బ్రాంచి. ఎప్పుడూ ఏదో పని వున్నట్లుగా మా ఆఫీసుకు వస్తుంటాడు నా పరిచయం వంకతో. వాడు వచ్చేది నాకోసం కాదని నాకు తెలుసు.

మా ఆఫీసు ప్రమీలారాజ్యం అనే చెప్పాలి. మొత్తం ఇరవైమంది స్టాఫ్‌లో సగానికిపైగా ఆడవాళ్లే. పెళ్లికానివాళ్ల దగ్గర్నుంచీ పెళ్లికొచ్చిన పిల్లలున్న వాళ్లవరకూ అన్ని ఏజ్ గ్రూపులవాళ్లు వున్నారు.

వెంకట్రావ్ ఉద్దేశ్యం మంచిది కాకపోయినా వాడన్నట్లుగా మా ఆఫీసు ఆర్గండీ, సౌత్‌కాటన్ చీర గరగరలతో జార్జెట్ చీరల జిలుగులతో గాజుల గలగలలతో తళతళలాడుతూ వుంటుందనేది నిర్వివాదాంశం.

సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ కీర్తి. ముగ్గురు పిల్లల తల్లి అని చెబితేగానీ తెలియదు. పరిపూర్ణ ప్రౌఢ. ఆమే కాదు అందరూ బావుంటారు. మొన్ననే కూతురి పెళ్లి చేసిన సుభద్రగారితోసహా.

అయితే వెంకట్రావులాంటి 'సగటు మగాళ్ల పుణ్యమా అంటూ అందరిమీద ఏవో' వినబడ్తూ వుంటాయి.

రసవత్తరమైన కథలు అల్లుతూ వింటూ చొంగ కార్చుకునే స్వభావం గల ఈ సగటు మగాళ్లు వారి వారి టార్గెట్ల వయసులతో పాజిబిలిటీస్‌తో పనిలేదు. ఆడదయితే చాలు. ప్రాయంలో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రాణం పోయేంతవరకు ఆడవారికి ఇవి తప్పవు. ముఖ్యంగా వర్కింగ్ ఉమెన్‌కి రెండురకాల శత్రువులు. ఆఫీసులో మగవాళ్లు, ఇళ్ల దగ్గర ఉద్యోగం చేయని ఆడవాళ్లు. ఇళ్ల దగ్గర భర్తతో చెప్పుకోలేని బాధలు ఉపశమనం కోసం సాటి ఆడదానితో చెప్పుకుంటే సానుభూతి లభించదు సరికదా 'ఈవిడేదో వగలు పోయుంటుంది. తిన్నగా వుంటే ఎవరేమంటారు?' అని ఎద్దేవా మిగులుతుంది.

నా ఆలోచలనని కట్టిపెట్టి వెంకట్రావు వైపు చూసాను. వాడి చూపులు ఎప్పటిలా కీర్తిగారిపైనే వున్నాయి. ఆఫీసు అన్నాక అనేక విషయాలలో మగవారితో మాట్లాడక తప్పదు. డీల్ చేసే సెక్షన్‌ని బట్టి కూడా ఎక్కువమందితో మాట్లాడే అవసరం కలుగుతూ వుంటుంది. అయితే మాటలు పెంచడంలో మగవాళ్లు సిద్ధహస్తులు. అలాంటి కొలీగ్స్‌పై ఆఫీసర్లకి కంప్లైంట్ ఇద్దామన్నా కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ నా చేతిలో వున్నాయని చెబుతూ మాటలలోకి దింపజూసే ఆఫీసర్లు లేకపోలేదు.

ఇంతలో ఒక వ్యక్తి వచ్చి కీర్తిగారి ప్రక్కకు కుర్చీ లాక్కుని మాట్లాడసాగాడు. అది చూసి వెంకట్రావ్ ''చూడు గురూ! నేను ఏం చెప్పినా నువ్వు నమ్మవు. చూడు వాళ్లిద్దరూ ఎలా మాట్లాడుకుంటున్నారో. అసలు ఆవిడ సంగతి నీకు తెలియదులే. షి ఈజ్ వెరీ లూజ్'' అన్నాడు.

''సోవాట్. ఆవడ ఎవరితో మాట్లాడితే నీకేంటి బాధ. మాట్లాడే పద్ధతి తెలిస్తే నువ్వు మాట్లాడు'' అన్నాను.

''మాట్లాడతా. నీలా మీనమేషాలు లెక్కబెడుతూ కూర్చోవడం నావల్లకాదు. అసలు ఈ ఆఫీసులో వుండుంటే ఎప్పుడో సెట్ చేసేవాడ్ని'' అన్నాడు.

''బెస్టాఫ్ లక్. బెటర్ లేట్ దేన్ నెవర్'' అన్నాను.


''చూస్తుండు. కాలర్ ఎగరేస్తూ లేచాడు వెంకట్రావు.

నేను యధాప్రకారం నా ఫైలు, ఆలోచనలతో మునిగిపోయాను. ఎవరో కాలు జారిందని నోరు జారేముందు తన భార్యనో, తోబుట్టువునో గుర్తుంచుకొంటే? ఈ రోజులలో ఒంటిచేత్తో సంసారం ఈదడం కష్టంగా వుండే గడ్డురోజులలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయడం తప్పడం లేదు. ఆర్థిక సమస్యలు తీరుతున్నాయేమోగానీ దాంపత్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. వెంకట్రావులాంటి వాళ్లవల్ల.

పదినిముషాలు గడిచాయి.

చెంప ఛెళ్లుమన్న శబ్దం వినబడడంతో ఉలిక్కిపడి చూసాను. కీర్తిగారి ప్రక్కనే కూర్చున్న వ్యక్తి వెళ్లిపోయినట్టున్నాడు. ఆవిడ మొహం ఎర్రగా కందిపోయి వుంది కోపంతో. ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఎదురుగా వెంకట్రావు తల వంచుకుని వెళ్లిపోతున్నాడు.

''హి ఈజ్ మై హస్బెండ్. స్కౌండ్రల్'' అరుస్తోంది కీర్తి. విషయం అర్థమై నవ్వుకున్నాను.



ఆమెతో అప్పటివరకూ మాట్లాడిన వ్యక్తి ఆమె భర్తేనని నాకు తెలుసు. కావాలనే వెంకట్రావుకు చెప్పలేదు. వాడేదో వెకిలిగా వాగి వుంటాడు.

మనసు విషయానికొస్తే అంతుపట్టనిది అగాధమైనది ఆడదాని హృదయమంటారు. పడుపు వృత్తి పడుచుకు కూడా మనసుంటుంది. పదిమందితో పడుకున్నా పదకొండో వ్యక్తిని నిరాకరించవచ్చు. కేవలం ఆమె గతం పదకొండో వ్యక్తికి ఆమెమీద రైట్స్ కల్పించదు. వృత్తిరీత్యా పదిమందికి మానాన్ని అమ్ముకున్నా ఏ ఒక్కడికో మాత్రమే అభిమానాన్ని ఇవ్వొచ్చు. దేన్ని అమ్ముకోవలసి వచ్చినా మగాడికి అమ్ముకోవాలి. అసలు ఆడదాన్నే అమ్మింది ఓ మగవాడే.

ఆడదాని మనసును అర్థం చేసుకోలేక అంతుబట్టక చంచలం అనేసాడు సగటు మగాడు. ఆడ, మగ భేదాలు సెకండరీ. మనిషి మనసు ముఖ్యం. సాటి ఆడదాన్నయినా, మగాడ్నయినా ముందుగా సాటి మనిషిగా అర్థం చేసుకోగల స్థాయికి ఎప్పుడు ఎదుగుతాడో ఈ సగటు మగాడు.

''సార్. మిమ్మల్ని పిలుస్తున్నారు'' ఫ్యూన్ పిలుపుతో ఆలోచనలోంచి ఆఫీసర్ రూమ్‌లోకి నడిచాను. ★